క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళాలు



వాడపల్లిలో దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తాడి సూర్యనారాయణరెడ్డి, కీర్తి మాధురి (ఆలమూరు మండలం జొన్నాడ) గురువారం రూ.51,666 విరాళం సమర్పించారు. అలాగే పి.వెంకట సత్యనారాయణరాజు, కాశీ అన్నపూర్ణ (రావులపాలెం) రూ.25 వేలు సమర్పించారు. దాతకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు కూడా పాల్గొన్నారు.

అప్పనపల్లిలో..

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు పరంశెట్టి మురళీకృష్ణ స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు పరంశెట్టి శివ (అల్లవరం మండలం బోడసకుర్రు) రూ.11,516 విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణకు అందించారు. దాతలకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు పాల్గొన్నారు.

ఆధార్‌తో జాబ్‌కార్డుల అనుసంధానం



ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న అధికారులు

ఆలమూరు: ఉపాధి హామీ పథకం కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసి, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆదేశించారు. ఇన్‌చార్జి ఏపీఓ పి.ప్రసాద్ అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. జాబ్‌కార్డులున్న వారందరికీ పని కల్పించాలన్నారు. ఆధార్‌తో అనుసంధానం చేయడం వలన ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు నేరుగా ఉపాధి కూలీలకు దక్కుతాయని చెప్పారు. గ్రామాల వారీగా ఉపాధి పనుల లక్ష్యాలు, సాధించాల్సిన ప్రగతి గురించి ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు.

జొన్నలగడ్డకు గురుబ్రహ్మ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గోపాలకృష్ణ

మలికిపురం: రాజోలుకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణకు గురుబ్రహ్మ పురస్కారం లభించింది. తూర్పుపాలెం అడబాల స్పోర్ట్స్ ఫౌండేషన్, కోనసీమ కల్చరల్ అసోసియేషన్‌ల ఆధ్వర్యాన జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమం గురువారం తెల్లవారుజామున జరిగింది. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న పలువురిని గుర్తించి ఈ మేరకు పురస్కారం అందించారు. ఇందులో భాగంగా గోపాలకృష్ణకు ఫౌండేషన్ చైర్మన్ అడబాల బ్రహ్మజీ, వేణుగోపాల్ తదితరుల చేతుల మీదుగా పురస్కారం అందజేశారు.

సుడో మల్లడా ఎస్టర్ గుడ్ల పంపిణీ



రైతులకు సుడో మల్లడా ఎస్టర్ గుడ్లు పంపిణీ చేస్తున్న ఉద్యాన అధికారులు

రావులపాలెం: ఉద్యాన పంటల్లో తెల్లదోమ నివారణకు రైతులు సుడో మల్లడా ఎస్టర్ గుడ్లను వినియోగించాలని ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి సూచించారు. రావులపాడులో ఉద్యాన శాఖ ఆధ్వర్యాన గురువారం జరిగిన కార్యక్రమంలో ఈ గుడ్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యాన పంటల సాగులో రైతులకు ఆత్మ నుంచి అన్నివిధాలా సహాయ సహకారాలు అందుతాయన్నారు. తెల్లదోమ నివారణకు ఈ గుడ్లను కొబ్బరి ఆకులకు అతికించాలని సూచించారు. ఆత్మ సౌజన్యంతో రైతులకు అంబాజీపేట పరిశోధనా స్థానంలో వెయ్యి గుడ్లను రూ.260కి ఇస్తారని తెలిపారు. ఉద్యాన శాఖ పథకాలను ఉద్యాన అధికారి అనూష రైతులకు వివరించారు. బొప్పాయి, కోకో, జామ, కొత్త తోటల పెంపకం, శాశ్వత పందిర్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా సత్యదేవి, కార్యదర్శి సాయిరామ్, వీఏఏ సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని శాంతి కల్యాణం



అంతర్వేదిలో స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ కల్యాణ మంటపంలోని ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం విష్వక్సేన పూజతో స్వామివారి శాంతి కల్యాణాన్ని ప్రారంభించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల ఘోష నడుమ ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యాన అర్చకులు, పండితులు కన్నుల పండువగా ఈ కల్యాణం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ పి.విజయ సారథి, భక్తులు పాల్గొన్నారు.



భక్తుల గ్యాలరీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

బారికేడ్లు, గ్యాలరీల ఏర్పాట్ల పరిశీలన

అంతర్వేది పుణ్యక్షేత్రంలో స్వామివారి కల్యాణోత్సవాలకు సంబంధించి భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లను అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎస్సై అడపా ఫణిమోహన్ గురువారం పరిశీలించారు. ఆలయం వెలుపల, లోపల భక్తుల క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాట్లను, కల్యాణ వేదికకు చేరి ఇరువైపులా భారీ షెడ్లలో స్వామివారి కల్యాణోత్సవం వీక్షించేందుకు అనువుగా గ్యాలరీల ఏర్పాట్లను వారు పరిశీలించారు. వేదిక వద్ద వీఐపీలు, రాజకీయ ప్రముఖుల గ్యాలరీల ఏర్పాట్లపై కూడా చర్చించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి కూడా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

రాజోలు: మెరకపాలేనికి చెందిన అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన యెలుమర్తి వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ప్రభుత్వం పరంగా అన్ని విధలా ఆదుకుంటామని చెప్పారు. మాజీ సర్పంచ్ అడబాల నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

శిథిల భవనాలతో ఆందోళన

- రెండు శాఖల మధ్య సమన్వయ లోపం
- కలవరపడుతున్న స్థానికులు



నగరంలో కూలిపోతున్న వ్యవసాయ శాఖ గోడౌన్

మామిడికుదురు: నగరం గ్రామంలో 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన వ్యవసాయ శాఖ భవనాలు రెండు పూర్తిగా శిథిలమై స్థానికులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ రెండు భవనాలనూ తొలగించాలని ఎంతో కాలంగా అధికారులు ఎదురు చూస్తున్నా మోక్షం మాత్రం కలగడం లేదు. నగరం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను చేర్చి ఈ రెండు భవనాలూ ఉన్నాయి. వీటిల్లో ప్రధానంగా వ్యవసాయ శాఖకు చెందిన గోడౌన్ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఈ భవనం మూడు దశాబ్దాల క్రితం శిథిల స్థితికి చేరింది. గోడలు ఎక్కడికక్కడ పగుళ్లు తీసి కూలిపోతున్నాయి. గోడలపై చెట్లు కూడా మొలకెత్తాయి. పంచాయతీ సమితులు ఉన్న కాలంలో సుమారు 50 ఏళ్ల క్రితం ఈ గోడౌన్ నిర్మించారు. గతంలోనే దీనిని తొలగించాల్సి ఉన్నా ఆ ప్రక్రియ మాత్రం పూర్తి కావడం లేదు. ప్రజాప్రతినిధులు చెప్పినా కూడా పనులు పూర్తి కాని దుస్థితి నెలకొంది. ఈ రెండు భవనాలూ తమ భూభాగంలో ఉన్నాయని నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చెబుతోంది. కాదు కాదు.. ఇవి తమకే చెందుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ రెండు శాఖల మధ్య కొనసాగుతున్న వివాదం శిథిల భవనాల తొలగింపునకు అడ్డంకిగా మారింది.



నగరంలో పూర్తిగా శిథిలమైన మండల వ్యవసాయ శాఖ కార్యాలయం

అదే కోవలో వ్యవసాయ శాఖ కార్యాలయం

మండల వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయం పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. నగరం గ్రామంలో వ్యవసాయ శాఖ గోడౌన్‌ను ఆనుకునే ఈ భవనం కూడా ఉంది. దీనిని కూడా 2010లోనే తొలగించాల్సి ఉంది. కానీ ఇప్పటికీ విముక్తి కలగడం లేదు. పాడైపోయిన ఈ భవనం స్థానే కొత్త దాని నిర్మాణానికి 2015లో గెయిల్ సంస్థ రూ.20 లక్షలు కూడా మంజూరు చేసింది. కానీ పాత భవనం తొలగింపు మాత్రం జరగకపోవడంతో ఆ నిధులు మురిగిపోతున్నాయి. పాత భవనం తొలగించే వరకూ కొత్తది నిర్మించే అవకాశం లేదు. తలుపులు పాడైపోయి గోడలు కూడా బీటలు తీసి, పాత భవనం కూలిపోతోంది. దీంతో మామిడికుదురులోని ఇతర ప్రభుత్వ శాఖకు చెందిన భవనంలో మండల వ్యవసాయ శాఖ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాడైపోయిన ఈ రెండు భవనాలనూ తొలగించాలని స్థానికులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యవసాయాధికారులు సంతకం చేస్తే..

భవనాల కూల్చివేతకు సంబంధించిన అగ్రిమెంటుపై వ్యవసాయ శాఖ అధికారులు సంతకం చేయాల్సి ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తి చేసి ఇచ్చాం. వారి నుంచి ఫైల్ వస్తే తదుపరి చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

– జి.ప్రదీప్, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, నగరం

వేమన.. తెలుగు సాహిత్య వెలుగు రేఖ

అంబాజీపేట: అందరికీ అర్థమయ్యే రీతిలో నీతి పద్యాలు చెప్పి, మెప్పించిన యోగి వేమన తెలుగు సాహిత్య వెలుగు రేఖ అని పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రంగాచారి అన్నారు. అంబాజీపేట పౌరవేదిక నిర్వాహకుడు వీరిన గోపాలం ఆధ్వర్యాన కళాశాలలో యోగి వేమన జయంత్యుత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగి వేమనపై కళాశాల విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వక్తృత్వంలో ఆర్వీడీ హనుమాన్, రొక్కాల మేఘన, జాన శివ నాగప్రశాంత్, వ్యాస రచనలో జి.యశస్వి, రొక్కాల మేఘన, జాన శివ నాగప్రశాంత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కుసుమ విశ్వనాథం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన పౌరవేదిక ప్రతినిధులు ఈ బహుమతులు అందజేశారు.

ఘనంగా వేమన జయంతి

రావులపాలెం: అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యాన స్థానిక జూనియర్ కళాశాలల్లో యోగి వేమన జయంతి వేడుకలు జరిగాయి. వేమన చిత్రపటానికి సంస్థ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన పద్యాలపై సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి దుళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.గోపాలకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



జొన్నాడలో వేమన విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జొన్నాడలో..

ఆలమూరు: జొన్నాడలో యోగి వేమన జయంతి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ ద్వారంపూడి అప్పారెడ్డి ఆధ్వర్యాన వేమన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. తన పద్యాల ద్వారా జాతిని వేమన చైతన్యవంతం చేసిన విధానాన్ని వక్తలు వివరించారు. స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాడి మెహర్ ఆదిత్యరెడ్డి, దొరబాబు యువశక్తి సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి రామారెడ్డి, మేడపాటి వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేమన జయంతి సందర్భంగా ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్వీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26న బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

లోపాలు లేకుండా ప్రజలకు వైద్య సేవలు



వానపల్లి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రజలకు ఎటువంటి లోటు, లోపాలు లేకుండా వైద్య సేవలందించాలని వైద్యులకు, సిబ్బందికి ఎంపీపీ, వానపల్లి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ మార్గన గంగాధరరావు సూచించారు. గురువారం జరిగిన పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. పీహెచ్‌సీ సేవలు, మందులు, వివిధ సౌకర్యాలపై సమీక్షించారు. వివిధ అనారోగ్యాలతో పీహెచ్‌సీకీ, సబ్ సెంటర్లకు వచ్చిన ప్రతి ఒక్కరూ సంతృప్తికరంగా తిరిగి వెళ్లే విధంగా సేవలందించాలని అన్నారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో శిథిలావస్థకు చేరి, నిరుపయోగంగా ఉన్న భవనాలు, షెడ్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని, ఆవరణను ఉపాధి హామీ పథకం ద్వారా బాగు చేయించాలని వైద్యాధికారికి సూచించారు.

పీహెచ్‌సీ ఆర్చి గేటు నిర్మాణానికి ఎమ్మెల్యే లేదా మండల పరిషత్ నిధుల కేటాయింపునకు కృషి చేస్తామని, ఇందుకు అంచనాలు రూపొందించాలని సూచించారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో తల్లీబిడ్డ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో కమిటీ సభ్యులు, తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, సర్పంచ్‌లు పల్లి భీమారావు, సాదు వెంకటలక్ష్మి, కన్వీనర్, వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విచక్షణారహితంగా ఎరువులు వాడవద్దు

అంబాజీపేట: విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల దిగుబడులు తగ్గిపోతాయని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని గురువారం మొసలపల్లిలో నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ, అవసరం మేరకు మాత్రమే ఎరువులు వినియోగించడం వల్ల ఖర్చు ఆదా అవడమే కాకుండా అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. మిత్రపురుగుల సంరక్షణకు ప్రతి వారం వరి చేలను పరిశీలించాలని రైతులకు సూచించారు. జీవ శిలీంధ్రనాశిని సూడోమోనాస్ కేజీ పొడర్‌ను 50 కేజీల పశువుల పెంటలో కలిపి ఎకరానికి వాడటం వల్ల భూమి ద్వారా వచ్చే శిలీంధ్ర తెగుళ్లు, అగ్గి, పొడ తెగులు రాకుండా ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ డి.దుర్గారావు, వీఏఏ వైడీ భీమారావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగ్‌ల సరఫరా

ఆలమూరు: ఎంఈఓ కార్యాలయానికి గురువారం కొత్త స్కూల్ బ్యాగ్‌లు వచ్చాయి. గతంలో విద్యార్థులకు పంపిణీ చేసిన సుమారు 350 బ్యాగ్‌లు చిన్న లోపాలతో అక్కరకు రాకుండా పోయాయి. ఈ విషయాన్ని ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన జిల్లా విద్యా శాఖ తొలి విడతగా 200 బ్యాగ్‌లు సరఫరా చేసింది. మిగిలినవి కూడా త్వరలోనే అందజేస్తామన్నారని ఎంఈఓ తెలిపారు.

ప్రతిభావంతులకు అండగా ఉంటాం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న నవీన్

మామిడికుదురు: ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా ఉంటామని మల్లికా మెమోరియల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ప్రతాపనేని నవీన్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూలులో హెచ్‌ఎం సీహెచ్ నిరంజని అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో 16 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందించారు. వీరిలో మండలంలోని 12 జెడ్పీ హైస్కూళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు పి.గన్నవరం మండలం తొండవరం, ఆర్.ఏనుగుపల్లి, నాగుల్లంక ఉన్నత పాఠశాలల విద్యార్థులున్నారు. పదో తరగతి టాపర్స్, ఇంటర్ ఫస్టియర్ టాపర్ ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. తన భార్య మల్లిక స్మారకార్థం ఈ ట్రస్టు ఏర్పాటు చేసి, ఏటా ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని నవీన్ చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం మైలవరపు రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

26 నుంచి బహుజన రాజ్యాధికార రథయాత్ర

మామిడికుదురు: రిపబ్లిక్ డే సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఈ నెల 26న బహుజన రాజ్యాధికార రథయాత్ర ప్రారంభమవుతుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు చింతా సత్య తెలిపారు. గురువారం జరిగిన పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రథయాత్ర ఫిబ్రవరి 1న జిల్లాలో ప్రవేశిస్తుందన్నారు. ఆ రోజు కొత్తపేట నుంచి అయినవిల్లి, ముమ్మిడివరం, అమలాపురం మీదుగా పి.గన్నవరం చేరుకుంటుందని వివరించారు. పి.గన్నవరంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగాన్ని వక్రీకరిస్తే సహించం

మలికిపురం: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని వక్రీకరిస్తే సహించేది లేదని మలికిపురం దళిత సంఘాల వేదిక హెచ్చరించింది. స్థానిక పూలే – అంబేడ్కర్ భవనంలో గురువారం జరిగిన సమావేశం.. మహాసేన రాజేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ఆయన సమాజానికి తప్పుడు సంకేతాలిస్తునారని పేర్కొంది. వేదిక కన్వీనర్ దేవ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో సీజనల్ వ్యాధులతో పాటు జ్వరాల బారిన పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీని గురువారం ఆయన పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు, గ్రామాల్లో ఉన్న జ్వర పీడితులను గుర్తించి వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులు వి.గౌతమి, శ్రీనివాస్‌లకు సూచించారు. ఓపీని పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు అందుతున్న సేవలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.



రోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

మామిడికుదురు: రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా గోదావరి నదిలో అడ్డుకట్ట ఏర్పాటు వల్ల తమ జీవనోపాధికి ఆటంకం కలుగుతుందని, తమకు న్యాయం చేయాలని కోరుతూ పెదపట్నంలంక, అప్పనపల్లి, పెదపట్నం గ్రామాల మత్స్యకార సంఘాల నేతలు తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. గోదావరి నదిలో ఇసుకతో అడ్డుకట్ట ఏర్పాటు చేయడం వల్ల సముద్రం నుంచి ఆటుపోట్లు నిలిచిపోయి మత్స్య సంపద తగ్గిపోతుందన్నారు. దీనిపై పరిశీలించి, తమ జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మల్లాడి రామకృష్ణంరాజు, పొన్నమండ సత్యనారాయణ, కోలా రాంబాబు, చింతా వెంకట రామరాజు తదితరులున్నారు.

క్లుప్తంగా

అట్రాసిటీ కేసుపై విచారణ

మామిడికుదురు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ గురువారం విచారణ జరిపారు. తన ఇంటి ఎదురుగా పంట కాలువపై వంతెన నిర్మాణం కోసం ఇటుకలు సిద్ధం చేస్తున్న పసుపులేటి నాగరాజు, త్రిమూర్తులును.. ఏం చేస్తున్నారంటూ తాను ప్రశ్నించగా.. వారు తనను దుర్భాషలాడి, తనపట్ల అసభ్యంగా ప్రవర్తించారని మామిడికుదురుకు చెందిన బీఎం లత గతంలో ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని, దీనిపై డీఎస్పీ విచారణ జరిపారని నగరం ఎస్సై షేక్ జానీబాషా తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం గోదావరిలో లభ్యం

సఖినేటిపల్లి: నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి మృతదేహం గోదావరిలో లభ్యమైంది. ఎస్సై అడపా ఫణిమోహన్ కథనం ప్రకారం .. వీవీ మెరక గ్రామ శివారు కంతేటివారిపోడుకు చెందిన అప్పారి సత్యనారాయణ (42) ఈ నెల 16న ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఎంత వెతికినా అతడి ఆచూకీ లేకపోవడంతో భార్య కనకదుర్గ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో రామేశ్వరం వద్ద గోదావరిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా అక్కడకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఆ మృతదేహం సత్యనారాయణదేనని నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గన్నవరపు చంద్రరావు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పరామర్శించి, సానుభూతి తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఆత్రేయపురం: ఉచ్చిలి గ్రామంలో పేకాట శిబిరంపై ఎస్సై సీహెచ్ సుధాకర్ ఆధ్వర్యాన పోలీసులు గురువారం దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని, రూ.3,540 నగదు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని 39 ఎంపీపీ పాఠశాలల పరిధిలో ఆరు నెలల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు గురువారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలానాయుడు, పి.భవానీశంకర్ ఆధ్వర్యాన వైద్య, ఆరోగ్య సిబ్బంది ఈ డ్రాప్స్ అందజేశారు. సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎన్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబీ పాల్గొన్నారు.

ప్రాజెక్టు వర్క్‌కు ప్రశంస

సఖినేటిపల్లి: రాష్ట్ర ప్రగతిపై సఖినేటిపల్లికి చెందిన రాజమహేంద్రవరం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థిని తాడి హెలెనా చేసిన ప్రాజెక్టు వర్క్‌ను ఎంఈఓ నల్లి మనోహరం అభినందించారు. ఈ ప్రాజెక్టు వర్క్‌ను తన కార్యాలయంలో గురువారం ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు వర్క్ స్ఫూర్తిదాయకంగా ఉందని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలు దూరం



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ అప్పారావు

మండపేట: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టొచ్చని పట్టణ సీఐ పి.శివగణేష్ అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక బస్టాండ్ వద్ద ఆటో, వ్యాన్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై సీఐ శివగణేష్, ఎస్‌ఐ కోన అప్పారావు, మండపేట ఎంవీఐ నాగేశ్వరరావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిమిత వేగంతో ఆటోలను నడపడం ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ముందు సీట్లలో ప్రయాణికులను కూర్చోబెట్టుకోకూడదని ఆటో డ్రైవర్లకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా, వాహన రికార్డులు సక్రమంగా లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎస్‌ఐ టీవీ రమణరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు దుర్గారావు, సంధాని తదితరులు పాల్గొన్నారు.

పొలంబడితో సాగు పద్ధతులపై అవగాహన

కపిలేశ్వరపురం: డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంతో సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కలుగుతుందని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. వెదురుమూడి శివారు వ్యవసాయ క్షేత్రంలో గురువారం పొలంబడి నిర్వహించారు. ఏఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ 14 వారాల పాటు నిర్వహించే పొలంబడి ద్వారా విత్తనం నాటిన నాటి నుంచి కోత వరకూ రైతుకు అండదండగా వ్యవసాయాధికారులు నిలుస్తున్నారని అన్నారు.

రామచంద్రపురం రూరల్: నెలపర్తిపాడులో మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. పొలంబడి ద్వారా రైతులను వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని సంకల్పించామని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఏఓ వివరించారు.

చిన్నారి వైద్యానికి హామీ

అమలాపురం టౌన్: సంక్రాంతి పండగల్లో కొత్తపేట రామాలయం వద్ద జరిగిన ఆర్కెస్ట్రా చూస్తూ ప్రమాదవశాత్తూ అదే ఆలయ భవనంపై నుంచి కింద పడి గాయపడిన చిన్నారి సీహెచ్ సత్యసాగర్ వైద్యానికి శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్ఏఎఫ్) తన వంతు సాయం చేసేందుకు ముందుకువచ్చింది. స్థానిక సాయి సంజీవిని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాగర్ వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చవుతుందని తెలుసుకున్న సంస్థ అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్ గురువారం ఆస్పత్రికి వెళ్లి ఆ బాలుడిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి, చిన్నారి చికిత్సకు తమ వంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్తపేట ఎస్ఏఎఫ్ ద్వారా ఈ సాయం అందజేస్తామన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

అంబాజీపేట: ప్రతి క్రీడాకారుడూ గెలుపోటములను సమానంగా స్వీకరిస్తేనే భవిష్యత్తులో రాణిస్తారని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మాచవరంలో ఐదు రోజులుగా జరుగుతున్న అంబేడ్కర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. విన్నర్‌గా కుసుమవారిపేట, రన్నర్స్‌గా ఎస్సీ కాలనీ, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కుసుమ సంతోష్ నిలిచారు. విజేతలకు షీల్డ్‌లు, నగదును సర్పంచ్ శాంతకుమారి, సుబ్బారావు దంపతులు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కుసుమ విజయకుమారి, కె.గుణశేఖర్, కె.బాబి, కె.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలన అస్తవ్యస్తం

అంబాజీపేట/మలికిపురం: బీజేపీ పాలన అస్తవ్యస్తంగా ఉందని, సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు విమర్శించారు. అంబాజీపేటలో పార్టీ సీనియర్ నాయకుడు ములపర్తి మోహనరావు నివాసంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రధాని మోదీ అన్యాయం చేశారన్నారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్రం వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి పోటీ చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మలికిపురం మండలం లక్కవరంలో జరిగిన రాజోలు నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశంలో ప్రభాకరరావు మాట్లాడుతూ కాంగ్రెస్‌ను పటిష్టం చేయాలని కోరారు. పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాల కృష్ణంరాజు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.